• ఆంధ్రప్రదేశ్. మాసపత్రిక. మే 2006

# పాత బంగారులోకం

"అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. నీ చిరకాల కోరిక నెరవేరబోతోందోయ్" అన్నాడు ఆనందరావు. యాలక్కాయ నోట్లోవేసుకుని మంచమెక్కుతూ.

వంటింట్లోకి వెళ్ళేదల్లా గిరుక్కున వెనక్కి తిరిగి, బాపుగారి సినిమాలోని హీరోయిన్‌లా కళ్లింతలు చేసి చూసి, "ఏమిటో అది? అయినా నా చిరకాల కోరిక ఒకటికాదు లెండి! బోలెడు.." అంది అమృత, మందుకుపడ్డ జడను రెండోభుజం మీదికి దండలా వేసుకుంటూ.

"అదేమరి ఆశంటే - పూర్వం మునీశ్వరుల తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమైనా ఒకే వరమిచ్చి పళ్లెం పడేసిన శబ్దంతో మాయమైపోయేవాడు తెల్సా" అన్నాడు ఆనందరావు దిండును వెనక్కి జరిపి దానికి అనుకుని కూర్చుంటూ.

"ఏ తపస్సూ చేయలేదు కాబట్టే మీకు భార్యగా పుట్టేను. పుట్టెడు కోరికలతో. సరా! యింతకీ విషయమేమిటో చెబుదురూ" అంది పమిటకొంగుతో ముఖాన్నద్దుకుంటూ.

"మరి కొద్దిరోజుల్లో మనం ఈ వూరొదిలేస్తున్నామోయ్" అన్నాడు తాపీగా.

"అరీ...!నిఝంగానే? ఎంచేతో?"

"అంతలా ఆశ్చర్యపోకు. అప్పులాళ్లకు జడిసో, ఉద్యోగం పోగొట్టుకునో కాదులే"

"మరి?"

"మనం కొత్త ఉద్యోగంలోకి- మరో కొత్త వూళ్లోకి మారబోతున్నామోయ్"

"అంటే.. అర్నెల్ల క్రితం మీరేదో కంపెనీ ఇంటర్వ్యూకని వెళ్లొచ్చారు. ఆ ఉద్యోగమా? అదే అయితే జీతం కూడ పెరుగుతుందీ..కదా..?" కళ్లెగరేసింది.

"సరిగ్గా కనుక్కున్నావ్. అదే ఉద్యోగం. కాకపోతే జీతం అట్టే పెరగదు. కానీ ప్రమోషన్లు త్వరత్వరగా వస్తాయి. చేసే పనికి సంతృప్తి వుంటుంది. బైదిబై యీ వూరొదిలి మరో వూరెళ్లాలనే నీ కోరిక తీరుతుంది" అన్నాడు ఆనందరావు.

"మీరు చెప్పండి మరి... ఇన్నేళ్లయి వుంటున్నాం. ఓ చిన్న ఇల్లు కట్టుకోడానికి పట్టుమని వందగజాల స్థలమైనా కొనుక్కోగలిగేమా ఈ వూళ్లో? అత్తెసరు జీతాలూ, అధిక ధరలూను. రాక్షసుడికెక్కువా రావణాసురిడికి తక్కువా అన్నట్టు అటు పల్లెకూ, ఇటు పట్నానికీ కూడ చెందని వూరిది. ఎంత త్వరగా వదిలేస్తే అంత ఆనందం నాకు" అంటూ వంటింట్లోకి లేడిపిల్లలా చెంగున దూకి, "అయ్యా ఆనందరావుగారూ యీ శుభ సమయంలో మీతో మాట్లాడవలసిన సంగతులు చాలానే వున్నాయి. దయచేసి నేనొచ్చేలోగా గుర్రుపెట్టేయకండి. అరక్షణంలో వచ్చేస్తా" అంటూ కేకపెట్టింది.

ఆనందరావు ఓ చిర్నవ్వునవ్వి "సరే" అని టి.వి.ఆన్ చేశాడు. ఆరువందల ముప్ఫయ్ రెండో ఎపిసోడ్‌లోని పగబట్టిన పడుచులు నాగుపాముల్లా బుసలుకొడుతున్నారు – 'మీ ఆనందానికీ ఆరోగ్యానికీ పుస్తకానికి మించిన కాలక్షేపం లేదు. ట్రింగ్...ట్రింగ్, అంటూ టీవీనీ ఆఫ్ చేసేసి పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు ఆనందరావు.

అయిదునిముషాల్లో అంతా రడీ అన్నట్టు వంటిల్లు చక్కబెట్టేసి, ముఖం కడుక్కుని బొట్టుకాటుకా దిద్దుకుని పౌడరద్దుకుని లేతనీలం వాయిల్ చీరలో పందిరి మంచమెక్కి ఆనందరావుకి అభిముఖంగా దిండు సర్దుకుని కూర్చుంది అమృత. ఆనందరావు పుస్తకం మూసేసి, "చెప్పు" అన్నాడు.

"మీరేం అనుకోకపోతే నాదో చిన్న సలహా" అంది అమృత గోముగా.

"నువ్వెప్పుడే నాకు సలహాలిచ్చేంత గొప్పదానివైపోయావా" నవ్వేడు చిన్నగా.

"లేదు మహాప్రభో. ఓ చిన్న కోరిక మాత్రమే."

"ఏమిటో అది?"

"మనం మరికొద్ది రోజుల్లో మరో కొత్తవూరు ఎలాగూ వెళ్లున్నాం గదా – కనీసం ఆ వూళ్లోనైనా ఓ కొత్తయిల్లు అద్దెకు తీసుకుందామండీ. మన పెళ్లయిన దగ్గర్నించీ యీ వూళ్లోనే యీ పాతకాలపు యింట్లోనే వుంటున్నాం. అవునా"

"ఎందుకనీ? అద్దెతక్కువని"

"కదా! మరి చూడండి ఈ పెచ్చులూడిపోయిన గోడల మధ్య ఈ పాతబడిపోయి రంగులు వెలసిపోయిన తలుపులు, దర్వాజాల మధ్య, ఈ గరుకునేల మీద– ముచ్చటైన మన యవ్వన జీవనాన్నంతా గడిపేస్తున్నాం. ఇల్లు పాతదైతే జీవితమూ రోతనిపిస్తుందిట – మా అమ్మమ్మ చెప్పింది. అంచేత ఆ కొత్త వూళ్లో అద్దె కాస్త ఎక్కువైనా ఓ కొత్తయింట్లో దిగుదామండీ. పోర్షన్ చిన్నదైనా ఫర్వాలేదు. మంచి లొకాలిటీలో... మంచి వీధిలో ఇల్లు చూసుకుందాం. ఏమంటారు? అంటూ ఆనందరావు ముఖంలోకి చూసింది.

"పాతిల్లే అయినా, మూడు పెద్దగదుల పోర్షన్ కాబట్టి, అటకలూ, అల్మరాలూ దండిగా వున్నాయి కాబట్టి మనకున్న ఇంత సామానూ పట్టిందిక్కడ. పోర్షన్ చిన్నదైతే ఈ సామానంతా ఎక్కడ పెడతావ్?"

ఆ ప్రశ్న ఆనందరావు ఎలాగూ వేస్తాడని ముందుగానే వూహించిన అమృత, "అందుకే నేనింకో విషయం కూడా చెప్పాలను కుంటున్నానండీ" అంది.

"నువ్వు చెప్పే స్థితికి ఎదిగిపోయి నన్ను తలూపుతూ వినే స్థితికి దిగజార్చేవన్నమాట. సరే.చెప్పు" అన్నాడు ఆనందరావు కాళ్లు బారజాపి.

అమృత సర్దుకుని కూర్చుని, "చెబితే మీకు కోపం వస్తుందేమో గానీ చెప్పక తప్పదు. మనింట్లో పాతసామానుతో పాటు కొంత పనికిరాని చెత్తకూడా పేరుకుపోయి వుంది. చైనా వాస్తు ప్రకారం ఇంట్లో పనికిరాని సామాన్లు అభివృద్ధినీ, ఆరోగ్యాన్నీ హరిస్తాయట. ఎక్కడో చదివాను. అంచేత కాకపోయినా, పనికిరాని కొన్ని పాతవి వదుల్చుకుని లేదా మార్చుకుని కొంత చెత్తను పారేస్తే మనకే మంచిది. ఎవరిళ్లు చూసినా కొత్త వస్తువులతో కొత్తగా కళ్లకింపుగా ఉంటున్నాయి. మనిల్లు మాత్రం ఇంకా పాత సామాన్లతోనూ, పందిరి మంచాలతోనూ పాతకంపు కొట్టుకుంటూ వుంది" అంది.

ఆ మాటలేం ఆనందరావుకి కొత్తగా అన్పించలేదు - గతంలో కూడా అమృత ఈ వుద్దేశాన్ని చాలసార్లే ప్రకటించింది.

"అయితే ఏంచేయిటంటావ్ - ఇప్పటికిప్పుడు పాతబడిపోయిన సామాన్లు పారేసి తళతళలాడే కొత్తవి కొనుక్కోడానికి మనవేం దండిగా డబ్బున్న వాళ్లంకాదు. జీతంరాళ్ల మీద బతికే మధ్య తరగతి మందభాగ్యులము. అది గుర్తుంచుకో" అన్నాడు ఆనందరావు కాస్త సీరియస్‌గానే.

"ఇదిగో మీక్కోపం వస్తుందని ముందే చెప్పాను. నేనేం కొత్త సామాన్లని ఉన్నపాట్న కొనేయమనటం లేదుగా. ప్రస్తుతానికి కొంత అక్కర్లేని పాతసామాన్లని తగ్గించుకుందాం అంటున్నాను. మీరు అర్థం చేసుకుని సహకరిస్తే చాలు".

"సరే చెప్పు. ఇంతకీ ఏమిటో ఆ పాత సామాను?"

"అడిగేరు కాబట్టి చెబుతున్నా- ముందు గది అల్మరాలో అడుగునున్న రెండు గూట్ళూ చూడండి"

"అవన్నీ పుస్తకాలూ, పేపర్ కటింగ్సూనూ. నీకు పనికిరావేమోగానీ ఎవరికైనా పనికొచ్చేవే"

"పాటిల్లో చాలా వరకూ మీక్కూడా ఇప్పుడు పనికిరావనే నా నమ్మకం. మీరు చదువుకున్నప్పటి రోజుల్లోని ఇంగ్లీషు గ్రామరు పుస్తకాలూ, తెలుగు వ్యాకరణ పుస్తకాలూ, లెక్కలూ, సైన్సు పుస్తకాలూ, అవన్నీ మీకిప్పుడు పనికిరావుగా. ఎన్నాళ్లు ఆ అరల్లో దాచినా

ఎప్పటికీ నాకు గ్రామర్లు రాదుగాక రాదు. దులపడానికి బోలెడు ధూళి మాత్రం వస్తుంది. ధూళి వల్ల కానరాని రోగాలూ వస్తాయి."

"అలా అని వాటన్నిటి తూకానికి పావలాకో బేడాకో అమ్మేయలేను. ఇప్పుడు ఈపాటి బతుకూ బతుకుతున్నానంటే అది ఆ అక్షరాల వల్ల, పుస్తకాల వల్ల అబ్బిన జ్ఞానం వల్లే"

"అటువంటప్పుడు వాటిని ఏ పేద విద్యార్థులకో, స్కూలు లైబ్రెరీలకో ఇవ్వొచ్చును గదా"

ఆ మాటకి ఆనందరావు ఆలోచనలో పడ్డాడు. "సరే చూద్దాం" అని మాత్రం అన్నాడు.

"ఇక ఆ న్యూస్ పేపర్ కటింగ్స్ విషయమేమిటి? ఎర్రబడిపోయి ముట్టుకుంటే చిరిగిపోయేట్టున్నాయి"

"అవి సైన్సుకీ, విజ్ఞానశాస్త్రానికీ సంబంధించిన కటింగ్సు – పేపరు పాతబడిందని సైన్సు పాతబడదుగా"

"అవన్నీ ఎప్పుడో పుస్తక రూపంలో వచ్చేసి వుంటాయి. ఈ కాగితాల్ని వదుల్చుకుని మీక్కావల్సిన ఓ కొత్తపుస్తకం కొనుక్కుంటే బావుంటుందిగా. నేనూ చదవొచ్చు."

ఆనందరావు ఈ సూచనకి కూడ అర్ధాంగీకారంగానే తలూపాడు. ఆ మాత్రం విజయం చాలన్నట్టు అమృత విజృంభించింది.

"ఇక అవతలగదిలో కిటికీ క్రింద పెట్టిన ఆ ట్రంకు పెట్టె చూశారుగా"

"దానికేం శుభ్రంగా వుంది. బోలెడంత సామానుని భరిస్తూ"

"ప్లాస్టిక్ పువ్వుల క్లాత్ దానిమీద పరిచినంత మాత్రాన సుబ్బరంగా ఎలా వుంటుందండీ? అసలే రేకుపెట్టె, అందులోనూ బీసీ నాటి పాతది. దాని కొసలు చూడండి లేచిపోయి ఎలా వుందో. పొరపాట్న చెయ్యో కాలో తగిలితే తొక్కలు రేగిపోతాయి – ఇక అందులోవున్నవన్నీ మనకి కాదుగదా, ఎవ్వరికీ పనికిరాని వస్తువులే! పాత జంతికల గొట్టాలూ, తుప్పుపట్టిన చట్రాలు, విరిగిన అప్పడాల కర్ర (మన హయాంలో విరగలేదండోయ్) మీరు ఎప్పుడో వాడి అమ్మేసిన సైకిల్ తాలూకు చైనూ – ఇలాంటివేగా? మేడ్ ఫర్ యీచ్ అదర్‌లా ఆ పనికిరాని సామాను కోసమే ఆ పెట్టె వున్నట్లు – అదిపోతే సగం దరిద్రం పోతుంది".

అమృత అలా మాట్లాడేస్తూంటే ఆనందరావుకి నోటమాట రాలేదు – స్టీలు మరచెంబులోంచి గ్లాసులోకి నీళ్ళు ఒంపుకొని తాగేసి, మరో గ్లాసుడు నీళ్ళు ఆనందరావుకి ఆఫర్ చేసింది అమృత. అప్పటికి తేరుకున్నాడు అతడు. "వద్దులే మీ వాళ్లు పెళ్లిలో పెట్టింది కాబట్టి ఆ స్టీలు మరచెంబు ఇప్పటికీ కొత్తగా తళతళలాడుతూ వుంది నీ దృష్టిలో – కదూ? ప్రసంగాన్ని కొనసాగించు మరీ.." అన్నాడు ఆనందరావు

అమృత మొదటి ప్రశ్నకు జవాబును దాటేసి, గొంతు సరిచేసుకుంది.

"మీరే చెప్పండి మన బెడ్‌రూం ఇలాగేనా వుండేది? సంసారానిక్కావల్సిన సామానుంతా ఇంచుమించు ఈ గదిలోనే వుంది - వాటికి తోడు గజ్జెల గుర్రంలాగ ఈ పందిరి మంచం ఎంత ఎత్తుందో చూడండి.

"మరి దానికింద ఎంత సామాను పట్టిందో చూశావా. లేకుంటే ఇల్లంతా సామాను పరుచుకుని వుండేది"

"మరదే నాకిష్టంలేనిది. దీన్ని అమ్మేసి ఎంచక్కా రెండు సింగిల్ కాట్స్ కొనుక్కుందాం. మా ఫ్రెండ్ శ్యామల ఇంట్లో చూశానీ మధ్య, ఎంత ముచ్చటగా వున్నాయో".

"ఎందుకుండవ్? మహాముచ్చటగా ముద్దొస్తూ కూడా వుంటాయి. వాటి ధరెంతో కనుక్కోలేకపోయావ్. పదివేలకి తక్కువుండదు. అయినా ఇప్పుడు దీనికి మాత్రం ఏం తక్కువచ్చిందనీ? ఎంత దృఢమైన పట్టీలో.. ఎంతమంచి నగిషీకోళ్లో చూడు. ఇప్పుడంత కర్ర ఎక్కడ వాడుతున్నారూ? పుల్లల్లాంటి కోళ్లు, బద్దల్లాంటి కమ్మీలూ, ప్లైవుడ్ షీట్లూ - మూడేళ్ళకే ముసలికళకి వచ్చేస్తున్నాయి. మన్నికకు దీని తర్వాతే అవన్నీనూ"

"ఏం మన్నికో? విలువైందే అయితే దీన్ని ఇక్కడే అమ్మేసి ఆ కొత్త వూళ్ళో రెండు కొత్త మంచాలు - మంచివేలెండి... కొనుక్కుందాం" అంది అమృత పట్టువదలకుండా.

"ఇది అచ్చొచ్చిన మంచం అమృతా. అర్థం చేసుకోవేం?"

"నాకు తెల్సులెండి. దీన్ని మీ తాతగారి పెళ్ళికి మీ ముత్తాతా, మీ నాన్నగారి పెళ్లికి మీ తాతా, మీ పెళ్లికి మీ నాన్నగారూ బహుమతిగా ఇచ్చేరు. అవునా? మీకు దాన్ని అమ్మడం ఇష్టం లేకపోతే ఏ మ్యూజియంకో ఇచ్చేయండి మనం కొత్తవి కొనుక్కొందాం".

అమృత మాటను వెంటనే కాదనలేక పోయాడు ఆనందరావు. "అన్నీ కలిసొస్తే చూద్దాంలే" అని మాత్రం అని, "ఇంకా నీ లిస్టులో ఏవేం వున్నాయో అన్నీ చెప్పేయ్" అన్నాడు.

"లిస్టులో చాలానే వున్నాయి కానీ ముఖ్యమైనవి మరో రెండు మాత్రమే" అంది అమృత. ఆనందరావు నీర్సంగా నిద్రముఖంతో ఆమె వంక చూశాడు.

"మొదటిది - మీ నాన్నగారి హయాంలో ఎలావుండేదో గానీ మీ హయాంలో నోరువిప్పకుండా హాతం వేసి మాడుపగిలేలా దెబ్బలు తిని ప్రస్తుతం అటకమీద సెటిలైపోయిన రేడియో. ట్యూన్ చెయ్యడానికి అరగంట పట్టేది - పలికితే రెండు స్టేషన్లు ఒకే మారు పలికేది. గుర్తులేదూ? దాన్ని ఇప్పుడు బాగుచేసే వారూ, కొనేవారూ ఎవరూ వుండరుగానీ

దానికి మోక్షాన్ని ప్రసాదించి మీకు దయ వుంటే ఒక చిన్న టూ ఇన్ వన్ కొనండి" అంది. ఆనందరావు చిర్నవ్వు నవ్వి వూరుకున్నాడు.

"ఇక చివరాఖరు లాస్టుది - ఏంటో చెప్పండి? బహుశః చెప్పలేరులెండి. నేనే చెప్తా. ముందుగదిలో గోడకు వేలాడే దుప్పికొమ్ములు. ఏ రాక్షసుడి బాణానికో, లేదా తూటాకో బలైపోయి మనింట్లో జీవసమాధి పొందినట్లనిపిస్తుంది దాన్ని చూస్తుంటే. ఇప్పుడు కాదు గానీ, మన పెళ్లయిన కొత్తల్లో మనింటికొచ్చిన మా స్నేహితుల్లో కొందరు 'మీ ఆయనకి వేట వ్యసనం కూడా వుండేవిటే' అని అడిగేవారు. చెప్పుకోలేక చచ్చేదాన్ని. అది మనకెందుకు చెప్పండి?"

తన మీద పడ్డ జోక్కి ఆనందరావు మనసారా ఆనందించి, "ఎప్పుడో మా తాతగారు వంశధార ప్రాజెక్టులో పనిచేసేటప్పుడు ఉచితంగా ప్రజలకి ఆయుర్వేద వైద్యం చేసేవారట. అలా ఉచిత వైద్యం పొందినవారెవ్వరో ఆయనకిది బహుమతిగా ఇచ్చారట. ఈ సారి జోస్యం చెప్పే ఏ కోయవాడో వస్తే ఇచ్చేద్దాంలే. సంతోషిస్తాడు" అన్నాడు.

"మీ ఆలోచన బాగానే వుంది గానీ వాడి వేషమూ ఈ కొమ్ములూ చూసి వీధి కుక్కలు వాడి వెంటబడి కరిచేసినా, మూగజీవాన్ని వేటాడేడని పోలీసులు వాడిని పట్టుకున్నా మనకి చుట్టుకుంటుంది. ఎందుకులెండి మరో ఆలోచన చెయ్యండి" అంది అమృత.

"అలాగే. ఇక అన్ని కోర్కెలూ అయినట్టేగా" అంటూ లైటార్పేశాడు ఆనందరావు.

"చెప్పడం అయింది" అంటూ దగ్గరగా జరిగింది అమృత.

◆ ❖ ◆

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఆ రోజు రానేవచ్చింది.

ఆ సాయంకాలం ఆనందరావు గుమ్మంలోకి అడుగు పెడుతూనే "గ్రాండ్ సక్సెస్ అమృతా. ఇలా ఈ ఉద్యోగానికి రాజీనామా చెయ్యడం, అలా కొత్త ఉద్యోగంలో చేరిపోవడం రెండూ యీ రోజే జరిగిపోయాయి. ఏ ఆటంకాలు లేవు. బ్రేక్ అంతకంటే లేదు" అన్నాడు.

"ఏ వూళ్లో వేశారో మరి?" అడిగింది అమృత ఆత్రంగా.

"ఆ కంపెనీ కొత్తబ్రాంచి ఈ వూళ్లోనే పెడుతున్నారట. నాకిక్కడే పోస్టింగిచ్చారు. అక్కడే ఫెయిలయ్యాం" అన్నాడు ఆనందరావు.

గాలి తీసిన బూరాయే అయ్యింది అమృత.

◆ ❖ ◆